క్లుప్తంగా

జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని...

- ఏపీపీఎఫ్ ప్రత్యేక ప్రార్థనలు

నెల్లూరు(బృందావనం): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయఢంకా మోగించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ (ఏపీపీఎఫ్)ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు జరిపినట్లు ఆ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ దాసరి రాజశేఖర్ తెలిపారు. విజయవాడలోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఏపీపీఎఫ్ రాష్ట్ర స్థాయి సమావేశంలో క్రైస్తవుల సమస్యలపై చర్చించినట్లు చెప్పారు. త్వరలో సీఎం వైఎస్ జగన్‌ను కలిసి క్రైస్తవుల సమస్యలపై వినతిపత్రం అందజేయాలని తీర్మానించినట్లు తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు చెప్పారు. ఏపీపీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్, రెవరెండ్ జీవన్‌కుమార్, జేమ్స్, 26 జిల్లాలకు చెందిన ఏపీపీఎఫ్ అధ్యక్షులు పాల్గొన్నారని తెలియజేశారు.

మౌలాలికి డాక్టరేట్


మౌలాలి

నెల్లూరు(టౌన్): నగరంలోని సంతపేటకు చెందిన సల్ల మౌలాలికి డాక్టరేట్ లభించింది. ఆయన విక్రమ సింహపురి విశ్వ విద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్ మధువతి పర్యవేక్షణలో 'కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటి ఇంటర్‌వెన్షన్స్ టువర్డ్స్ ప్రాజెక్ట్ అఫెక్టెడ్ పీపుల్- ఏ స్టడీ ఆన్ నెల్లూరు డిస్ట్రిక్ట్ అనే అంశంపై పరిశోధనలు చేసి పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఇందుకుగానూ మౌలాలికి వర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా మౌలాలిని వర్శిటీ రిజిస్ట్రార్ రామ చంద్రారెడ్డి, డీన్ సుజా ఎస్ నాయర్ తదితరులు అభినందించారు.

నేడు కలప బహిరంగ వేలం

నెల్లూరు(క్రైమ్): చెముడుగుంటలోని జిల్లా కేంద్ర కారాగార అనుబంధ పాక్షిక ఆరు బయలు వ్యవసాయ క్షేత్రంలోని 9.206 ఘనపు మీటర్ల కలపను శనివారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు జిల్లా కేంద్ర కారాగార సూపరింటెంటెండ్ కే రాజేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఉదయం 9 నుంచి 10గంటలలోపు రూ.3 లక్షలు ధరావత్తు చెల్లించి టోకన్ పొంది వేలంలో పాల్గొనాలని కోరారు.

సీనియర్ న్యాయవాది మృతికి సంతాపం


పులి బలరామయ్య (ఫైల్)

నెల్లూరు (లీగల్): నగరంలోని బాలాజీనగర్‌కు చెందిన మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, సీనియర్ న్యాయవాది పులి బలరామయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతిపై బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్య, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఆర్ రోజారెడ్డి, తదితరులు సంతాపం తెలిపారు.

పాడి రైతులకు మెరుగైన సేవలు అందించాలి

కోవూరు: గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు మెరుగైన సేవలు అందించడమే కాకుండా మేలుజాతి పశు ఉత్పత్తిపై వారిలో అవగాహన పెంచేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమార్య అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాల సమావేశ మందిరంలో శుక్రవారం కోవూరు, విడవలూరు మండలాలకు సంబంధించిన పశుసంవర్ధకశాఖ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లక్ష్యాలు నూరుశాతం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా రైతుభరోసా కేంద్రాల పరిధిలో ఉన్న పాడి రైతులకు సీజన్‌లో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్యులు షబానా, ప్రీతి సాల్మన్, సజ్జాద్ అహ్మద్, పశుసంవర్ధకశాఖ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

'గండికోట'కు సన్మానం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్‌ను శుక్రవారం వెంకటాచలంలోని తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో జరిగిన కవి సమ్మేళనంలో డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ సన్మానించారు. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్‌కు ప్రశంసాపత్రం అందజేసి ఆయన సేవలను కొనియాడారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయండి



కార్పొరేటర్లతో సమావేశమైన ఎంపీలు విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్, మేయర్ స్రవంతి

- నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): రానున్న ఎన్నికల్లో నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం ఆయన నగరంలోని రామ్మూర్తినగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై వారితో చర్చించారు. గత 20 రోజులుగా నెల్లూరు సిటీలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు వార్డుల పరిధిలోని ప్రజలతో మమేకమై పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో సత్సంబంధాలు కలిగి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు. ప్రత్యర్థి పార్టీకి చెందిన అభ్యర్థి ఎంతటి బలవంతుడైనా వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఎండీ ఖలీల్ గెలుపు ఖాయమని, అందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, నగర మేయర్ స్రవంతి, పార్టీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలో జరుగుతున్న త్యాగరాజ స్మరణోత్సవాల్లో భాగంగా ఏడో రోజు శుక్రవారం ఉదయం సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా గణపతిపూజ, పుణ్యాహవాచనం, కంకణధార, యజ్ఞోపవిత ధారణ, మహాసంకల్పం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు, నైవేద్యం, ఆశీర్వచనం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం ఏకాంత సేవ వేడుకగా జరిపారు. ఈ కార్యక్రమాలను త్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ అధ్యక్ష,శాశ్వత కార్యదర్శులు చతుర్వేదుల శ్రీరామమూర్తి, ఎనమండ్ర నాగదేవిప్రసాద్, సభ్యులు పర్యవేక్షించారు.

హరివిల్లు ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం రేపు


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న అమరావతి కృష్ణారెడ్డి, దోర్నాల

నెల్లూరు(బృందావనం): శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని హరివిల్లు ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని పురమందిరంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, హరివిల్లు క్రియేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు దోర్నాల హరిబాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాంధీబొమ్మ సమీపంలోని 25 కళాసంఘాల చాంబర్‌లో శుక్రవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ 25 కళాసంఘాల పర్యవేక్షణలో, హరివిల్లు క్రియేషన్స్ ఆధ్వర్యంలో గత పదేళ్లుగా ఉగాది పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది హరివిల్లు ఉగాది ఆత్మీయ పురస్కారాన్ని సినీనటుడు ఒంగోలుగిత్త ఫేమ్ కిషోర్‌దాస్‌కు అందజేయనున్నట్లు వెల్లడించారు. హరివిల్లు క్రియేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు దోర్నాల హరిబాబు మాట్లాడుతూ వివిధ రంగాలకు చెందిన మరో పది మందిని ఉగాది పురస్కారాలతో సత్కరించనున్నట్లు తెలిపారు. 25 కళా సంఘాల కన్వీనర్లు అమీర్‌జాన్, నేదురుమల్లి హరనాథ్‌రెడ్డి, భాస్కర్, వనారస లక్ష్మీకాంత్ బాబు, దోర్నాల శ్రీనివాసరావు, డ్యాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జమీర్, కార్యదర్శి జనార్దన్, నెల్లూరు నారాయణ బాబు, సునీల్‌రెడ్డి, సినీ స్టంట్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదినారాయణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం


సమావేశంలో మాట్లాడుతున్న పురుషోత్తమ్

నెల్లూరు సిటీ: రాష్ట్రంలోని శాలివాహన కుమ్మరుల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామని ఏపీ శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ ఎం పురుషోత్తమ్ అన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని కొత్తూరులోని శాలివాహన కల్యాణ మండపంలో శాలివాహనుల ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తమ్ మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శాలివాహన కుమ్మరుల సంక్షేమానికి ఫెడరేషన్ ఏర్పాటు చేశారన్నారు. ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో వివిధ పథకాల ద్వారా 6.25 లక్షల మంది కుమ్మరులకు రూ.1680 కోట్ల లబ్ధి చేకూర్చిందని వివరించారు. శ్రీశైలం, కోటప్పకొండలో కుమ్మరుల నిత్యాన్నదాన సత్రానికి 50 సెంట్ల వంతున స్థలాన్ని కేటాయించిందని తెలిపారు. కొండబిట్రగుంటలో కుమ్మరికుంటలో ఆక్రమణకు గురైన స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కుమ్మరులకు కేటాయించేందుకు చర్యలు తీసుకుందన్నారు. చిలకలూరుపేటలో టీడీపీ నాయకులు ఆక్రమించిన స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కుమ్మరులకు ఇవ్వడానికి సిద్ధమైందన్నారు. ప్రభుత్వం తమ కులస్తులకు అన్ని విధాలా సహకరిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా మళ్లీ గెలిపించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాలివాహన కుమ్మరి సంక్షేమ సంఘం నెల్లూరు అధ్యక్షుడు కేవీ నరసయ్య, ఏపీ కుమ్మర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ ఎం నాగేశ్వరరావు, కార్యదర్శి రాఘవరామయ్య, జిల్లా వెల్ఫేర్ కమిటీ సభ్యులు పీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి కొనసాగుతున్న వలసలు


పార్టీలో చేరిన 33వ డివిజన్ వారితో ఆదాల


22వ డివిజన్ టీడీపీ నాయకులతో ఆదాల


నవీన్‌సింగ్‌కు పార్టీ కండువా కప్పుతున్న ఆదాల

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గ పరిధిలోని 33వ డివిజన్, వెంగళరావునగర్‌లోని ఏ బ్లాక్‌కు చెందిన 30 కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తన కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణ వెంకయ్య, మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 27వ డివిజన్‌కు చెందిన యువ నాయకుడు నవీన్ సింగ్ తన మిత్రబృందం పది మందితో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తన కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ నగరాధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచల్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల చేరిక

22వ డివిజన్‌కు చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మలిరెడ్డి కోటారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన పినిశెట్టి సురేష్, మహమ్మద్ రఫీ, బాబు, పసుపులేటి రాజశేఖర్, తదితరులకు ఆదాల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

అభివృద్ధి ప్రదాతలను ఆశీర్వదించండి


ఎన్నికల ప్రచారం చేస్తున్న సునంద

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు అభివృద్ధి కోసం రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీ విజయసాయిరెడ్డి సతీమణి సునంద విజయసాయిరెడ్డి కోరారు. నగరంలోని 45వ డివిజన్ రామ్మూర్తినగర్‌లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి నెల్లూరు అభివృద్ధికి ప్రత్యేకంగా రూపొందించిన మేనిఫెస్టో వివరాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. ప్రతిఒక్కరిని అప్యాయంగా పలకరిస్తూ టైలరింగ్, ఇస్త్రీ, తదితర పనులు చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక కార్పొరేటర్ వేదవతి, పార్టీ నాయకులు నేతాజీ సుబ్బారెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, 45వ వార్డు నాయకులు కోట శ్రీనివాసులు, బాలుయాదవ్, పసుపులేటి సునీల్‌బాబు, మహిళ నేతలు హిమబిందు, మాధవీవర్మ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి


ఇఫ్తార్ విందులో ప్రార్థనలు చేస్తున్న ఖలీల్

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఒకటో డివిజన్, నారాయణరెడ్డిపేటలో స్థానిక కార్పొరేటర్ జానా నాగరాజ్‌గౌడ్, ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ మౌలా, తదితరుల ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, నాయకులు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, లేబూరు పరమేశ్వరరెడ్డి, నర్సారెడ్డి, సుధాకర్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): రంజాన్ సందర్భంగా నగరంలోని 44వ డివిజన్ కలెక్టరేట్ ఎదురుగా ఉన్న బారకాసు మసీదులో శుక్రవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్ పాల్గొన్నారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్పొరేటర్లు నీలి రాఘవ, షేక్ కరీముల్లా, మైనార్టీ విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజాహుస్సేనీ, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మీరామొహిద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు అలీం, అతహర్‌బాషా, మొహ్మద్‌తారీఖ్, ఆసీఫ్ పాషా, మౌలానా అజీజ్, జియాఉల్‌హక్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ జీవితం ఆదర్శనీయం


జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్


చేతివృత్తుల సంఘం ఆధ్వర్యంలో..


నివాళులర్పిస్తున్న మేయర్ స్రవంతి


నివాళులర్పిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్


సీపీఎం ఆధ్వర్యంలో..


బీటీఏ ఆధ్వర్యంలో...


సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో..


జిల్లా సహకార శాఖ కార్యాలయంలో..


జగ్జీవన్‌రామ్ భవన్‌లో చీరల పంపిణీ

- ఎస్పీ కే ఆరీఫ్‌హఫీజ్

నెల్లూరు(క్రైమ్): భారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జీవితం ఆదర్శనీయమని నూతన ఎస్పీ కే ఆరీఫ్‌హఫీజ్ పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి శుక్రవారం ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మానవతావాదం, ఆదర్శవాదం కలిగిన మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి తన వంతు కృషి చేశారన్నారు. అంటరానితనంపై ఉక్కుపాదం మోపారన్నారు. స్వాతంత్ర సమరయోధుడిగా, ఉపప్రధానిగా, కేంద్ర మంత్రిగా దేశానికి ఎనలేని సేవలందించిన జగ్జీవన్‌రామ్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, పోలీసు అధికారులు, ఆర్‌ఐ అంకమరావు, తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ భవన్‌లో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ భవన్‌లో సీమాంధ్ర ఎమ్మార్పీస్, యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందింటి సుబ్బయ్య మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సేవా సమితి అధ్యక్షుడు కాకి శ్రీనివాసులు, ఎస్సీ, ఎస్టీ యునైటెడ్ ఫోరం రాష్ట్రాధ్య, కార్యదర్శులు రవిరాఘవేంద్ర, సుబ్బారావు, దళిత సంఘాల నేతలు విజయ్ కుమార్, మంద బాబ్జి, కృష్ణ, శేఖర్, రంగనాధం, ఆనందరావు, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

- వేదాయపాళెం సెంటర్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య, ఆలూరు తిరుపాలు, సీఐటీయూ నెల్లూరు రూరల్ కార్యదర్శి కిన్నెరకుమార్, ఐద్వా రూరల్ కార్యదర్శి షాహీనా బేగం, తదితరులు పాల్గొన్నారు.
- వేదాయపాళెం సెంటర్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి చేతివృత్తుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో వడ్డెర వృత్తిదారుల సంఘ రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. వడ్డెర వృతిదారుల సంఘ జిల్లా నాయకులు బాల వెంకటేశ్వర్లు, తిరుపాలు, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.
- సామాజిక సమరసత వేదిక సహాయకార్యదర్శి దాసరి రాజేంద్ర ఆధ్వర్యంలో వేదాయపాళెం సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, సీనియర్ పాత్రికేయులు జయప్రకాష్, టీపీగూడూరు మండలాధ్యక్షుడు రాధాకృష్ణ, డాక్టర్ సతీష్, బుజ్జయ్య, కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

డీసీఓ కార్యాలయంలో..

నగరంలోని జిల్లా సహకారశాఖ అధికారి(డీసీఓ) కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీలత, ఉమామహేశ్వరి, ఉష, మోహన్‌కృష్ణ, సహకారశాఖ విద్యాధికారి గోగుల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

నెల్లూరు(బారకాసు): మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని నగర మేయర్ పొట్లూరి స్రవంతిజయవర్ధన్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి మేయర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల రహిత సమాజం కోసం తన జీవితాంతం కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.

- గొప్ప పరిపాలన దార్శనికుడు జగ్జీవన్‌రామ్ అని కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కమిషనర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు(టౌన్): దర్గామిట్టలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, అసోసియేట్ అధ్యక్షుడు వేణుగోపాల్, ఆర్థిక కార్యదర్శి ఆదినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, నాయకులు మనోజ్‌కుమార్, రవి, చెంచయ్య, పెంచలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ,శరణ్‌కుమార్

నెల్లూరు(బృందావనం): శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని జేసీఐ, జేఏసీ, జీవన్‌యోగశాల ఆరోగ్య సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలకు వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జేఏసీ నేషనల్ డైరెక్టర్ కోట సత్యనారాయణ, జేఏసీ నెల్లూరు చైర్మన్ చలువాది శరణ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను సుబేదారుపేటలోని కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. పప్పులవీధిలోని జేసీఐ భవన్‌లో ఈ నెల 9న ఉగాది పండగ నాడు సాయంత్రం 6 గంటలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. వివరాలకు యోగా మాస్టర్ ఎంవీ ప్రసన్నకుమార్‌ను 93914 91052 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీఐ నెల్లూరు అధ్యక్షుడు మెంటా రమణ్‌కుమార్, యోగా గురువు ఎంవీ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్):నగరంలోని రేబాల ఆస్పత్రి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్ 11కేవీ విద్యుత్ ఫీడర్‌లో అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నందున శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఏసీనగర్, రాంనగర్, పరిసర ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.